

ఏపీఎస్పీడీసీఎల్ మొద్దు నిద్ర

మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు విక్రయం జరిగిపోయి ఏళ్లు గడిచాక బకాయిలు చెల్లించాలంటూ ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు నోటీసులు గోడకు అతికించారు. -8లో



జిల్లాలో విస్తారంగా ఉలవ సాగు

ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఈ ఏడాది ఉలవ పంట సాగుపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా 35, 127 హెక్టార్లలో పంట సాగైంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 153 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో కామర్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకులుగా అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. నెట్, ఏపీ సెట్, డాక్టరేట్ (పీహెచ్‌డీ) ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగినవారు డిసెంబర్ 23 సోమవారం లోపు దరఖాస్తును కార్యాలయంలో అందజేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి చంద్ర నాయక్

పుల్లంపేట: మండల పరిధిలోని రాజుగారిపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా రాగి, జొన్నలు, కొర్రలు పండించాలన్నారు. కౌలు గుర్తింపు కార్డు తీసుకున్న రైతులందరికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం ఉద్యానవన శాస్త్రవేత్త సందీప్ నాయక్ ఆకుతోటల్లో, మామిడి పూలు, అరటితోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.మస్తాన్, లోకేశ్వర్ రెడ్డి, దిలీప్ కుమార్, రెడ్డి ప్రవీణ్, గాయత్రి, ఉదయ భాను, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు పోటీలు

రాయచోటి టౌన్: ఈ నెల 22వ తేది ఆదివారం రాయచోటి డైట్ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాసరచనతో పాటు వక్తృత్వ పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం డైట్ అధ్యాపకులు శివభాస్కర్ 94413 28448, కె. శ్రీదేవి 7989189220, అసదుల్లా 94400 84715లకు ఫోన్ చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల ఎంపికకు దరఖాస్తు చేసుకోండి

రాజంపేట టౌన్: ఈనెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గూగుల్ షీట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి సాంకేతిక సహాయం కోసం టెక్నికల్ అఫిషియల్ ఏ.రామాంజనేయులును సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేవారు 18 సంవత్సరాలలోపు వారు అయితే ఎఫ్ఏఐ గుర్తింపు కార్డు, 18 సంవత్సరాలు పైబడిన వారైతే ఎఫ్ఏఐ గుర్తింపు కార్డుతో పాటు గతంలో పాల్గొన్న ఫెన్సింగ్ క్రీడ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. వివరాలకు 6301979079, 94908 6391 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షలను సక్రమంగా నిర్వహించాలి



ఖండ్రిగ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్జేడీ శామ్యూల్

గుర్రంకొండ: పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్ వన్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. బుధవారం మండలంలోని ఖండ్రిగ ఉర్దూ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాస్తున్న బయోలాజికల్ పరీక్షలపై ఆరా తీశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా పత్రాలను ఒక గంటముందు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఉపాధ్యాయులు తెచ్చుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేంద్రబాబు, హెడ్మాస్టర్ జావీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుఫాను టెన్షన్!



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అన్నదాతలు సహా పలు వర్గాల్లో ఆందోళన మొదలైంది. చేతికందివచ్చిన పంట వర్షార్పణం అవుతుందనే బెంగ ఓ వైపు.. సాగులో ఉన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనే గుబులు మరో వైపు రైతన్నలను వెంటాడుతోంది. దీనికి తోడు తుఫాను ఎఫెక్ట్‌తో వ్యాధులు విజృంభిస్తున్నాయి.

- వరున తుఫానులతో బెంబేలెత్తుతున్న జనం
- ఇటీవలి వర్షాలకు వరి పంటపై తీవ్ర ప్రభావం
- చిరు వ్యాపారుల జీవనానికి దెబ్బ
- మరోవైపు ముసురుకుంటున్న వ్యాధులు



వైఎస్ఆర్ జిల్లా చెన్నూరు మండలంలో ఇటీవల వర్షాలకు నేలకొరిగిన వరి పంట

సాక్షి కడప/సాక్షి రాయచోటి: తుఫానులు భయపెడుతున్నాయి. ఇదేంటి తుంపర వర్షమే కదా అనుకుంటున్నారా... నిజమే వరుణ దేవుడు కురిపించే తుంపరే టెన్షన్ పెడుతోంది. అందుకు కారణాలు లేకపోలేదు. ఒకటి కాదు, రెండు కాదు.. రెండు, మూడు నెలల వ్యవధిలోనే నాలుగైదు తుఫాన్లు రావడంతో పంటలు వేసిన రైతులతోపాటు వ్యాపారులు కూడా అమ్మో తుఫాను అంటూ హడలిపోతున్నారు. అందులోనూ శీతాకాలం సీజన్ కావడంతో తుఫాను ధాటికి చలి విపరీతంగా పెరిగి రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో వాతావరణం మంచు దుప్పటిలా కప్పుకుంటోంది. చలి పెరగడం...వ్యాధులు పంజా విసురుతుండడం...పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో జన జీవనం కూడా స్తంభించిపోతోంది.

చిరు వ్యాపారుల్లో అలజడి

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తుఫాను ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయగానే చిరు వ్యాపారుల గుండెల్లో అలజడి మొదలైంది. సాధారణ వర్షమైతే అప్పటికప్పుడు లేదా ఒకరోజుతో తెరిపి లభిస్తుంది. కానీ, తుఫాను అయితే మూడు, నాలుగు రోజులపాటు తీవ్రత ఉండడంతో వ్యాపారాలు కూడా పూర్తి స్థాయిలో పడిపోతున్నాయి. అసలు చిన్నచిన్న షాపులకు వ్యాపారాలు లేక లబోదిబోమంటున్నారు. రోడ్డు వారగా విక్రయించే పండ్ల వ్యాపారులు, డ్రై ఫ్రూట్స్, దోసెలు, బజ్జీలు, టీకొట్లు, చిరుతిండ్ల బండ్లు ఇంటికే పరిమితం అవుతున్నాయి. అందుకే తుఫాను అనగానే ముందుగా వారి గుండెల్లోనే రైళ్లు పరిగెడుతున్నాయి.

జనజీవనం అస్తవ్యస్తం

ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వేకోడూరు నియోజకవర్గంలో వాగులు, వంకలు పోటెత్తాయి. రిజర్వాయర్లకు కూడా నీటి ప్రవాహం పెరగడంతో దిగువకు వదిలారు. ప్రధానంగా రోడ్లు కొట్టుకుపోవడం, వాగులు, వంకల్లో నీటి ప్రవాహం పెరగడంతో పల్లెల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షం కారణంగా ప్రధాన రహదారులపై జనాలు కనిపించడం లేదు. చాలా వరకు ప్రయాణాలు సైతం వాయిదా వేసుకుని ఇళ్లకే పరిమితం అవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఏది ఏమైనా ఇలా అనేక వర్గాలను తుఫాను టెన్షన్ వెంటాడుతోంది.



అన్నదాతల్లోనూ ఆందోళన

తుఫాను వచ్చిందంటే ప్రధానంగా అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. సాగులో ఉన్న పంటలకు ప్రయోజనం కంటే నష్టాలే ఎక్కువగా మిగుల్చుతున్నాయి. ఇటీవలి తుఫానులో కురిసిన వర్షాలతో అటు వైఎస్సార్, ఇటు అన్నమయ్య జిల్లాల్లోని రైల్వేకోడూరు, రాజంపేట, తంబళ్లపల్లె, మదనపల్లె, మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, చెన్నూరు ఇలా అనేక ప్రాంతాల్లో పండ్ల తోటలతోపాటు వరికి దెబ్బతగిలింది. నోటికాడికి వచ్చిన వరి పంట పొలాల్లోనే నేల వాలిన పరిస్థితి. ఇప్పుడు కూడా వరి పంట కోత దశలో ఉంది. కానీ తుఫాను అనగానే ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది.

ఐదు నెలల్లో వచ్చిన తుఫాన్లు:	06
వైఎస్సార్‌జిల్లా వ్యాప్తంగా సాగైన మినుము:	12,540 హెక్టార్లు
బుడ్డశనగ:	72,776 హెక్టార్లు
అన్నమయ్య జిల్లా...	
కోత దశలో ఉన్న వరి:	1300 ఎకరాలు
సాగైన మినుము:	9253 హెక్టార్లు

పడకేస్తున్న పారిశుద్ధ్యం

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వర్షంతోపాటు తుఫాను ప్రభావంతో పారిశుద్ధ్యం పడకేస్తోంది. తుఫాను ప్రభావం నెలకొన్న ప్రతిసారి రెండు, మూడు రోజులపాటు ఏకధాటి వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. వీఐపీల పర్యటన సమయంలోనే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు తప్ప మిగతా సమయాల్లో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం గురించి పట్టించుకోవడం లేదు.

ముసురుతున్న వ్యాధులు



ప్రతిసారి తుఫాన్లు వచ్చినప్పటి నుంచి చలి విపరీతంగా పెరగడం.. శీతాకాల సీజన్ కావడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. జలుబు, జ్వరాలు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులతో వృద్ధులతోపాటు చిన్నారులు వణికిపోతున్నారు. అంతేకాకుండా ఇతర వ్యాధులు కూడా విస్తరిస్తున్నాయి. తుఫాను ప్రభావం నేపథ్యంలో వ్యాధులతో ఆస్పత్రుల వైపు జనాలు పరుగులు తీస్తున్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని రిమ్స్‌తోపాటు రాయచోటిలోని పెద్దాస్పత్రి, మదనపల్లె, ప్రొద్దుటూరులలోని జిల్లా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. రెండు జిల్లాల్లోని మైదుకూరు, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు, రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, పీలేరులోని ప్రైవేటు ఆస్పత్రులు కూడా రోగులతో నిత్యం రద్దీగా మారుతున్నాయి. ప్రధానంగా చలికి తోడు తుఫాను ప్రభావంతో వాతావరణంలో మార్పు ఫలితంగా చిన్నారులు, వృద్ధుల్లో దగ్గు, ఆయాసం ఒక్క ఉదుటున తగ్గకపోవడంతో ఎక్కువ ఆందోళన చెందుతున్నారు.



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రతిరోజు వచ్చే రోగుల సంఖ్య:	1200
మదనపల్లె, ప్రొద్దుటూరులలో జిల్లా ఆస్పత్రులకు వచ్చే రోగులు:	1800-2000
రెండు జిల్లాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రోజువారీగా వచ్చే రోగుల సంఖ్య:	12 వేలకు పైగానే

మట్టిని కొల్లగొట్టినా చర్యలేవీ!

ఏపీఎండీసీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ సమీపంలో అక్రమంగా మట్టిని తరలించిన దృశ్యం

ఓబులవారిపల్లె: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమార్కుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. సెప్టెంబర్ నెల 4వ తేదీన మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ సమీపంలోని పాత అయ్యవురెడ్డిపల్లెలో కూటమి నాయకుల అండతో రాత్రికి రాత్రి ఏపీఎండీసీ ఉద్యోగులు మట్టిని అక్రమంగా తరలించి విక్రయించారు. నేటి వరకు ఏపీఎండీసీ అధికారులు వారిపై చర్యలు తీసుకోలేదు. తాము ఏం చేసినా అడిగేవారు ఎవరూ లేరనే ధోరణిలో ఏపీఎండీసీ ఉద్యోగులు యథేచ్ఛగా వందలాది ట్రిప్పుల మట్టిని టిప్పర్ల సాయంతో తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకొన్నారు. కూటమి నాయకుల పలుకుబడి కారణంగా అటు రెవెన్యూ, ఇటు ఏపీఎండీసీ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంపై మంగంపేట ఏపీఎండీసీ సీపీఓ సుదర్శన్ రెడ్డిని వివరణ కోరగా మట్టిని అనుమతులు లేకుండా తరలించిన విషయం వాస్తవమేనన్నారు. సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎండీకి సూచించామన్నారు. అయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్నట్లు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు చిన్న తప్పు చేసినా భూతద్దంలో చూసి అక్రమ కేసులు, చర్యలు తీసుకుంటున్న అధికారులు కూటమి నాయకుల అండదండలతో రెచ్చిపోతున్న ఉద్యోగులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టిని అక్రమంగా తరలించి లక్షలాది రూపాయలు కొల్లగొట్టిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఐ రవిశంకర్‌రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ రాష్ట్ర ఉత్తమ నేర పరిశోధన కేసులకు గాను ఇచ్చే ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డు అన్నమయ్య జిల్లా దిశ పోలీసు స్టేషన్ సీఐ రవిశంకర్‌రెడ్డికి దక్కింది. బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో చిత్తూరు జిల్లా ఎస్పీ వీన్ మణికంఠ చందోలుతో కలిసి డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది జులై 7వ తేదీన చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలో జరిగిన ఏటీఎం దొంగతనం కేసులో కరడుగట్టిన అంతర్‌రాష్ట్ర నేరస్తుడిని అరెస్టు చేసినందుకు ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డులో మొదటి స్థానంలో ఎంపికయ్యారు. అప్పట్లో చిత్తూరు వెస్ట్ సీఐగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డి ప్రస్తుతం అన్నమయ్య జిల్లా దిశ స్టేషన్ సీఐగా పనిచేస్తున్నారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి అవార్డు అందుకుంటున్న చిత్తూరు జిల్లా ఎస్పీ, పక్కన సీఐ

భూ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కలికిరి: జిల్లాలో భూ సమస్యలు లేకుండా చేయడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మండల పరిధిలోని పారపట్ల గ్రామంలో బుధవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత వరకు సమస్యలను సదస్సులోనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొన్ని సమస్యలకు నోటీసులిచ్చి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పారపట్ల గ్రామంలో రీ సర్వేలో భూముల విస్తీర్ణం తక్కువ వచ్చినట్లు అందుతున్న ఫిర్యా దులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రైతులు కూడా రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని పరిష్కరించుకోవాలన్నారు. పారపట్ల గ్రామానికి చెందిన సుమారు ఇరవై మందికి పైగా రైతులకు పొలాలకు దారి సమస్య దీర్ఘకాలికంగా నెలకొందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో విచారించిన ఆయన దారికి అవసరమైన భూమిని భూ సేకరణ చేసేందుకు నివేదికను సిద్ధం చేసి పంపాలని తహసీల్దార్ మహేశ్వరిబాయిని ఆదేశించారు. అలాగే గ్రామ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని గేటు ఏర్పాటు చేశారని అందిన ఫిర్యాదు మేరకు ఆక్రమిత స్థలాన్ని స్వయంగా పరిశీలించిన కలెక్టర్ ఆక్రమణలను తొలగించాలని ఆదేశించడంతో సాయంత్రానికే తహసీల్దార్ ఆక్రమణలను తొలగించారు. సదస్సులో రెవెన్యూ సిబ్బంది తీరుపై రైతులు కలెక్టర్‌కు వరుస ఫిర్యాదులు చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేయండి

పారపట్లలో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సుకు హాజరైన జిల్లా కలెక్టర్ తిరిగి వెళుతుండగా మార్గమధ్యం రంగనాథపురం వద్ద ఇసుక నిల్వను గమనించారు. దీంతో తహసీల్దార్‌ను పిలిచి విచారించారు. ఇసుక అక్రమంగా తరలించే వారిపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మండల ప్రత్యేకాధికారి జయప్రకాష్, మండల సర్వేయర్ రెడ్డెప్ప, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ భువనేశ్వరి, ఎండోమెంట్ అధికారి మంజుల పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్రంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

- కడప- రేణిగుంట రోడ్డు విస్తరణ చేపట్టాలి
- భాకరాపేట నుంచి బెస్తవారిపేట రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలి
- కడప-ముద్దనూరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మించాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రమిచ్చిన ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి

పీలేరు/కడప సెవెన్‌రోడ్స్: అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని రహదారులను అభివృద్ధి చేసేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని రాజంపేట, కడప పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరికి వారు వినతిపత్రమిచ్చారు.కడప - రేణిగుంట రోడ్డు విస్తరణ, మదనపల్లెకు బైపాస్ రోడ్డు, పుంగనూరు - పులిచెర్ల - చిన్నగొట్టిగల్లు రోడ్డు అభివృద్ధి, పీలేరు పట్టణంలో దొడ్డిపల్లె మీదుగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని మిథున్‌రెడ్డి విన్నవించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. అలాగే జాతీయ రహదారి 716పైన ఉన్న భాకరాపేట నుంచి బద్వేలు (ఎన్‌హెచ్ 67), పోరుమామిళ్ల (ఎన్‌హెచ్ 167)మీదుగా ప్రకాశం జిల్లాలోని బెస్తవారిపేట (ఎన్‌హెచ్ 544డి) వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలని వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. రేణిగుంట నుంచి ముద్దనూరు వరకు గల ఎన్‌హెచ్ 716 ఎంతో కీలకమైందని తెలిపారు. కోడూరు, రాజంపేట, కడప, కమలాపురం, ఎర్రగుంట్ల, చిలంకూరు ద్వారా ముద్దనూరుకు వెళుతుందన్నారు. ఈ రహదారి వెంట సిమెంటు తదితర పరిశ్రమలు ఉన్నాయని వివరించారు. ఈ రహదారిపై ట్రాఫిక్ అధికంగా ఉంటుందన్నారు. అందువల్ల కడప నుంచి ముద్దనూరు వరకు ఉన్న రహదారిని ఫోర్‌లేన్ రోడ్డుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కడప నుంచి రేణిగుంట వరకు 130 కిలోమీటర్ల మేర ఉన్న రహదారిని ఫోర్‌లేన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఇప్పటికే మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇక మిగిలి ఉన్న ముద్దనూరు-కడప (ఎన్‌హెచ్ 716)ను ఫోర్‌లేన్‌గా అభివృద్ధి చేయాలని కోరారు.

వనిపెంట మీదుగా హైవే విస్తరణ పనులు చేపట్టాలి

ఎన్‌హెచ్ 167 మైదుకూరు నుంచి పోరుమామిళ్ల వెళుతోందన్నారు. గత ఏడాది సర్వే కూడా నిర్వహించారని పేర్కొన్నారు. మైదుకూరు నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో వనిపెంట గ్రామం ఉంటుందన్నారు. ఈ జాతీయ రహదారి వనిపెంట గ్రామం మధ్య నుంచి వెళుతోందన్నారు. ఫలితంగా పలు కుటుంబాలు చిన్న చిన్న షాపులు, దుకాణాలు రహదారికి ఇరువైపులా పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్నఫళంగా ఈ జాతీయ రహదారిని వనిపెంట గ్రామంలో నుంచి కాకుండా బైపాస్‌లో వెళ్లేలా నిర్ణయించారన్నారు. బైపాస్ రహదారి వల్ల వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. పలు గ్రామాల ప్రజలు హైవే నిర్మాణానికి తమ భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితులను గమనించి గ్రామ ప్రజలు కోరుతున్న విధంగా వనిపెంటలో నుంచే జాతీయ రహదారిని నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


రత్నమ్మ

గాలివీడు : పట్టణంలోని పెద్దూరులో నివాసముంటున్న గుండ్లూరి రత్నమ్మ కనిపించలేదంటూ ఆమె భర్త ఆంజనేయులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి రత్నమ్మ కనిపించలేదు. మతిస్థిమితం సరిగా లేని కారణంగా బయటికి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిస్తే 7569690966 సెల్ నెంబర్‌కు సమాచారం అందించాలని వారు కోరారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్ సుధారాణికి బెయిల్ మంజూరు

మదనపల్లె : సోషల్ మీడియా యాక్టివిస్ట్ సుధారాణిపై అన్నమయ్య జిల్లా మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో బుధవారం రెండో ఏడీఎం కోర్టు న్యాయమూర్తి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేశారు. సుధారాణి తరపున లాయర్ ప్రసాదరెడ్డి న్యాయమూర్తి ఎదుట వాదనలు వినిపించారు. దీంతో సుధారాణికి రెగ్యులర్ బెయిల్ మంజూరైంది. పీటీ వారెంట్‌లో భాగంగా సుధారాణిని ఈనెల 12న నరసారావుపేట నుంచి తీసుకువచ్చి మదనపల్లె పోలీసులు కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. పోలీసు విచారణ తర్వాత 13వ తేదీన న్యాయమూర్తి ఎదుట హాజరు పరిస్తే ఈనెల 26 వరకు రిమాండ్ విధించారు. దీంతో ఆమెను పోలీసులు తిరిగి నరసారావుపేటకు తీసుకెళ్లారు. ఈ కేసుకు సంబంధించి దాఖలైన బెయిల్ పిటిషన్ విచారణలో సుధారాణికి రెగ్యులర్ బెయిల్ మంజూరైంది.

బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చిన్నమండెం మోడల్ స్కూల్ విద్యార్థులు

చిన్నమండెం : చిన్నమండెం మోడల్ స్కూల్‌లో ఎంపీసీ చదువుతున్న ఎ.వైష్ణవి, సీఈసీ చదువుతున్న వై.శ్రీహరినాయుడు ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ వి.రమేష్ తెలిపారు. ఈ నెల 14, 15, 16వ తేదీలలో గుంటూరు జిల్లా సత్తెనపల్లె సమీపంలోని లయోలా కాలేజీలో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలలో వారు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ కె.రామాంజనేయులు, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అరెస్టు

మైదుకూరు : బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎర్రగొల్ల గోపాలస్వామిని అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద ప్రసాద్ తెలిపారు. డీఎస్పీ తెలిపిన మేరకు.. గోపవరం మండలం ఎల్లారెడ్డి పేటకు చెందిన మేడిమెల సుశీల భర్త రత్నం 2018లో మృతి చెందాడు. అయితే అతను బతికి ఉన్నట్టు ఫోర్జరీ ఆధార్ సృష్టించి అతని పేరుతో ఉన్న చెన్నంరెడ్డిపల్లె పొలం సర్వే నంబర్ 1754/2లోని 1.02 ఎకరాల పొలాన్ని గోపాలస్వామి, డ్రైవర్ లక్ష్మీనారాయణ పేరుతో రిజిస్టర్ చేయించుకున్నాడు. ఆ విషయంపై రత్నం భార్య మేడిమెల సుశీల ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బుధవారం ఎర్రగొల్ల గోపాలస్వామిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

జిల్లాలో విస్తారంగా ఉలవ సాగు

ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఈ ఏడాది ఉలవ పంట సాగుపై దృష్టి సారించారు. ఎక్కువమంది పంట సాగుపై ఆసక్తి చూపడంతో ప్రభుత్వం రైతుకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 400 రైతు సేవా కేంద్రాల ద్వారా 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేసింది. దీంతో రైతులు 35, 127 హెక్టార్లలో ఉలవ పంట సాగు చేశారు.

- జిల్లాలో 35,127 హెక్టార్లలో సాగు చేసిన రైతులు
- 80 శాతం రాయితీతో 14,845 క్వింటాళ్ల పంపిణీ

నియోజకవర్గాల వారీగా ఉలవ సాగు

నియోజకవర్గం	హెక్టార్లు
పీలేరు	7790
మదనపల్లె	3973
తంబళ్లపల్లె	14456
రాయచోటి	7214
రాజంపేట	1694


పీలేరు మండలంలో ఉలవసాగు

పీలేరు రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో వేరువనగ సాగు చేసుకోలేని రైతులు ఉలవ పంట సాగు చేశారు. జిల్లాలో 63,573 మంది రైతులు దాదాపు 35,127 హెక్టార్లలో గత సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో రైతులు పంట సాగు చేశారు. ఎకరాకు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ఉలవలు రూ.5 వేల ధర పలుకుతున్నాయి. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 7534 హెక్టార్లు కాగా, అందుకు నాలుగింతలు అధికంగా ఈ ఏడాది ఉలవ సాగు చేశారు. వాతావరణం బాగా అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

14,845 క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేశాం...



ఖరీఫ్‌లో వేరుశెనగ సాగు చేయని రైతులకు అనువుగా జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా 14,845 క్వింటాళ్ల ఉలవలు 80 శాతం రాయితీతో పంపిణీ చేయడం జరిగింది. సకాలంలో ఉలవలు అందడంతో మంచి అదునుకు లక్ష ఎకరాల్లో పంట సాగు చేయడంతో ఎక్కడ చూసినా ఆశాజనకంగా కన్పిస్తోంది. మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
– బి. చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి

ఉలవసాగుతో భూసారం పెరుగుతుంది...



కరవు పరిస్థితుల దృష్ట్యా ఉలవ పంట సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. తరువాత సాగు చేసే పంటలకు భూమి అనువుగా మారి పంట దిగుబడి బాగుంటుంది. ఉలవతోపాటు రైతులకు పశుగ్రాసం కొరత తీరుతుంది. ఆహారంగా తీసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలుంటాయి. ప్రస్తుతం మార్కెట్ ఉలవలకు మంచి డిమాండ్ ఉంది.
– రమణరావు, ఏడీఏ, పీలేరు

3.5 ఎకరాలో సాగు చేశా...



ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో మాకున్న 3.5 ఎకరా పొలం ఖాళీగా ఉంచుకోవడం జరిగింది. అయితే 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేయంతో ఆర్‌ఎస్‌కే వద్దకు వెళ్లి తెచ్చుకున్నాం. వర్షాలు కూడా సకాలంలో కురవడంతో పంట బాగా ఉంది. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.
– దేవేంద్రరెడ్డి, ఆవులవారిపల్లె, కావలిపల్లె, పీలేరు మండలం

ఉద్యోగుల బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం

ఎస్టీయూ రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యంరాజు

రాజంపేట టౌన్ : ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి హెచ్చరించారు. స్థానిక మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీ అంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. 117 జీవో రద్దును స్వాగతిస్తున్నామని, హైస్కూల్ ప్లస్ స్థానంలో జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల ఏర్పాటుచేసి ఉపాధ్యాయులకు రెండు ఇంక్రిమెంట్లతో పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తొలుత నిరసనలు, ఆందోళనలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు చేసేందుకు వెనకాడబోయేది లేదని తెలిపారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఓబులేసు, రాధాకృష్ణ, శ్రీనివాసవర్మ, సర్తాజ్‌లను ఎస్టీయూ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లం అశోక్‌కుమార్, ఎల్లయ్య, మురళీ మనోహర్, శ్రీనివాసులు, రవిశంకర్‌రెడ్డి, నాగరాజు, పిల్లి రామకృష్ణ, నరేంద్ర, గోపాల్, సత్యనారాయణ, స్వామినాథ్, యానాదయ్య, గంగాధర్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలను పరిశీలించిన న్యాక్ బృందం


ల్యాబ్ విభాగాలను పరిశీలిస్తున్న న్యాక్ పీర్ కమిటీ ప్రతినిధులు

వైవీయూ : నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) పీర్ కమిటీ బృందం బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)ను సందర్శించింది. కళాశాలకు వచ్చిన న్యాక్ పీర్ కమిటీ చైర్ పర్సన్ ఆచార్య రాజీవ్ జైన్, మెంబర్ కో ఆర్డినేటర్ డాక్టర్ మధురేంద్రకుమార్, సభ్యుడు డా.రమేష్ కుంబార్ బృందానికి ముందుగా ఎన్‌సీసీ కేడెట్స్ గౌరవ వందనం సమర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జి. రవీంద్రనాథ్ కళాశాల సమగ్ర ప్రగతిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆపై న్యాక్ బృందం కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించింది. డిపార్ట్‌మెంట్‌లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలు, పూర్వ విద్యార్థుల ప్రగతి, పరిశోధనలు, పరిశోధక పత్రాలు, సైటేషన్స్, హెచ్-ఇండెక్స్ తదితర అంశాలన్నింటినీ క్షుణ్ణంగా బృందం సభ్యులు అడిగి తెలుసుకుని రికార్డు చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో కళాశాల ప్రగతిలో వారి భాగస్వామ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. భౌతిక శాస్త్రం వంటి విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరచడంపై న్యాక్ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్య ఆర్‌జేడీ డాక్టర్ ఆర్.డేవిడ్ కుమారస్వామి, న్యాక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.బి.రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ ఆర్.నీలయ్య, డా.మహేష్, అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ జట్టుకు ఎంపిక

రైల్వేకోడూరు అర్బన్ : జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి అరవింద్ ఎంపికైనట్లు ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 14వ తేది నుంచి 17వ తేది వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన 68వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలలో తమ విద్యార్థి ప్రతిభ చూపారని తెలిపారు. అనంతరం అరవింద్‌ను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

తీగల చోరీ.. పైపు ధ్వంసం


కేబుల్ వైర్ చోరీ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

నిమ్మనపల్లె : గుర్తుతెలియని వ్యక్తులు కేసింగ్ పైపు ధ్వంసం చేసి, 60 మీటర్ల కేబుల్ తీగలు చోరీచేసిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. బాధిత రైతులు పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ముష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లెకు చెందిన కృష్ణప్పగారి సహదేవ, పెదనాన్న కుమారుడు కె.వెంకటరమణ కలిసి గ్రామ సమీపంలోని భూమిలో బోరు వేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల పొలంలో బావికి, బోరుకు సంబంధించిన స్టార్టర్లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇదిలా ఉంటే మంగళవారం రాత్రి పొలం వద్ద ఎవరూలేని సమయంలో బోరు కేసింగ్, పైపులైన్ గేట్ వాల్వ్ పగలగొట్టి 60 మీటర్ల కేబుల్ తీగలు ఎత్తుకెళ్లారు. మోటారు తొలగించి బావిలో పడవేశారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షురాలిగా హాజీరా



హాజీరాకు నియామకపత్రం అందజేస్తున్న సగీర్

రాయచోటి అర్బన్ : మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలిగా హాజీరా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పట్టణంలోని ఎంహెచ్‌పీఎస్ కార్యాలయంలో బుధవారం జిల్లా మహిళా విభాగం సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.సగీర్, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎస్.నాగజ్యోతి, సభ్యులుగా షబానా, ఫర్హానా, హస్నా, యాస్మిన్, సోఫియా, రాయచోటి పట్టణ ఉపాధ్యక్షురాలిగా షేక్ దిల్షాద్ ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ రాయలసీమ యూత్ కన్వీనర్ ఇమ్రాన్ అలీ, జిల్లా ఉపాధ్యక్షుడు అష్రఫ్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


జమ్మలమడుగు రూరల్ : బైక్ మరమ్మతులు చేసుకుని వెళ్తుండగా అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలపరిధిలోని పి. బొమ్మేపల్లి గ్రామంలోని తండాకు చెందిన మూడే నారాయణ నాయక్(34) జమ్మలమడుగుకు వచ్చారు. బైక్ మరమ్మతు చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో జమ్మలమడుగు పరిధిలోని రోజా టవర్స్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. మృతు డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెవెన్యూ సదస్సులు పట్టవా!


తహసీల్దారును ప్రశ్నిస్తుంటే.. పక్కనే పేపర్ చదువుతున్న నోడల్ అధికారి

మదనపల్లె : రైతుల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటుంటే....క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. సమస్యలు పట్టించుకోకుండా అధికారులు తమ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మదనపల్లె మున్సిపల్ పరిధిలోని కమ్మపల్లెలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ప్రజలు తమ సమస్యలను వివరిస్తుంటే...నోడల్ అధికారి, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి మాత్రం తనకేమీ పట్టదన్నట్లు ఇలా న్యూస్ పేపర్ చదువుతూ కనిపించారు. రైతులు రెవెన్యూ సిబ్బందితో గొడవ పడుతున్నా.. ఆయన మాత్రం పేపర్ చదవడంలో నిమగ్నమై కనిపించారు. సదస్సు నిర్వహణకు నోడల్ అధికారిగా ఉన్న డీఎల్‌డీఓ ఇలా చేయడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి జైలు శిక్ష


పొన్నన్ పలనీ స్వామితో అటవీశాఖ అధికారులు

సిద్దవటం : ఎర్రచందనం కేసులో నేరం రుజువు కావడంతో తమిళనాడుకు చెందిన పొన్నన్ పలనీ స్వామికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ జడ్జి బుధవారం తీర్పు వెలువరించినట్లు సిద్దవటం ఇన్‌చార్జి రేంజర్ నయూమ్‌అలీ తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ 11 ఎర్రచందనం దుంగల స్మగ్లింగ్‌లో తమిళనాడుకు చెందిన పొన్నన్ పలనీ స్వామి పాల్గొనడంతో అప్పటి సిద్దవటం అటవీ శాఖ అధికారి కె.ప్రసాద్ 15 అక్టోబర్, 2018లో నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేశారన్నారు. అనంతరం కోర్టులో హాజరు పరచగా.. అప్పటి సిద్దవటం బీట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, రేంజర్ ప్రసాద్ సాక్ష్యాలతో కేసు నిరూపణ కావడంతో పొన్నన్ పలనీస్వామికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. దీంతో నిందితుడిని నెల్లూరు జైలుకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దతిప్పసముద్రం మండల మీట్ నిర్వహించండి

- వారంలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు
- శాంతిభద్రతలపై కోర్టుకు ఆధారాల సమర్పణ
- ఎంపీపీ అనుమతి లేకుండానే..
- అధికారుల అత్యుత్సాహంతో నేడు మండల మీట్


సమావేశం నిర్వహించాలని ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

బి.కొత్తకోట : అధికారుల ఏకపక్ష ధోరణి, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం, అభివృద్ధిని కాలరాసే విధంగా సాగుతున్న చర్యలపై పెద్దతిప్పసముద్రం ఎంపీపీ మొహమూద్ హైకోర్టును ఆశ్రయించగా అధికారులకు చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చింది. పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి వారంలోగా మండల పరిషత్ సమావేశాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తంబళ్లపల్లె నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకోవడమే కాక మండల పరిషత్ సమావేశాలను జరగనివ్వకుండా అడ్డుపడుతూ శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీటీఎం మండల పరిషత్ సమావేశ నిర్వహణపై హైకోర్టును ఆశ్రయించారు.

వారంలో జరపండి :

పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ సమావేశాన్ని ఈ ఆగష్టు ఏడున నిర్వహిస్తున్నట్టు అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. సమావేశానికి పై హాలులో ఎంపీపీ, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఈ సమావేశం జరగనివ్వకుండా కూటమి నాయకులు అడ్డుపడి శాంతిభద్రతల సమస్యను సృష్టించారు. దీనిపై ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించారు. సమావేశం జరగకుండా అడ్డుపడిన ఘటనలకు సంబంధించిన వివరాలు, అధికారుల తీరుపై ఆధారాలను సమర్పించారు. హైకోర్టు ఈ మేరకు తీర్పు ఇస్తూ నిబంధనల మేరకు వారంలోగా సమావేశం నిర్వహించాలని, శాంతిభద్రతల సమస్య లేకుండా సుహృద్భావ వాతావరణంలో సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు ఎంపీపీ, ఎంపీటీసీలు బుధవారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం అజాద్‌కు వినతిపత్రం అందించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఎలాంటి సమస్యలు లేకుండా సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కోరారు.

ఎంపీపీ అనుమతి లేకనే..

హైకోర్టు వారంలోగా సమావేశం నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు బుధవారం అందగా అధికారులు అత్యుత్సాహం చూపించారు. సాధారణంగా మండలమీట్ జరపాలంటే ఎంపీపీ ఇచ్చే తేదీ, అనుమతి పొందాక సర్క్యులర్ ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం ఇవ్వాలి. అయితే ఎంపీపీ మొహమూద్ అనుమతి లేకుండానే అధికారులు సమావేశ నిర్వహణకు నిర్ణయించి ఈనెల 11న సర్క్యులర్ జారీ చేశారు. గురువారం సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉరుసు ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


ఉరుసు ఉత్సవాలపై మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : పెద్దమండ్యం మండలం కలిచెర్ల మౌలా కాపహాడ్ ఉరుసు ఉత్సవాల నిర్వహణలో చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం సబ్‌కలెక్టరేట్‌లో కడప అమీన్‌పీర్ దర్గా, కలిచెర్ల మౌలాకా పహాడ్ పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేని, హైదరాబాద్‌కు చెందిన అన్సారుల్ హక్ వర్గాలకు చెందిన వారితో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్సారుల్ హక్ వర్గం ఈనెల 26, 27, 28 తేదీల్లో కలిచెర్లలో ఉరుసు ఉత్సవాల నిర్వహణకు ప్రయత్నిస్తున్నారని ఆరీఫుల్లా హుస్సేని ఆరోపించారు. ఈ దర్గాపై సర్వహక్కులు కలిగిన వారే ఉరుసు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అన్సరుల్‌హక్ మాట్లాడుతూ... తమ తాత, ముత్తాతల నుంచి దర్గాపై తమకు హక్కులు ఉన్నాయని, తామే ఉరుసు నిర్వహిస్తామన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ మాట్లాడుతూ....ఇరువర్గాలు వారి వద్ద ఉన్న దర్గా డాక్యుమెంట్స్ తీసుకురావాలని, వాటిని పరిశీలించాకే దర్గా ఉరుసు ఉత్సవాలకు అనుమతిస్తామన్నారు. డీఎస్పీ కొండయ్య మాట్లాడుతూ... అనుమతి లేకుండా కలిచెర్ల ఉరుసు ఉత్సవాలకు ఏర్పాట్లు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అంతవరకు కలిచెర్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించాలని పెద్దమండ్యం పోలీసులను ఆదేశించారు.

రూ.18 లక్షల రికవరీకి నోటీసులు సిద్ధం



గొర్రెలు, మేకల రైతు ఉత్పత్తిదారుల సంఘం

పెద్దతిప్పసముద్రం : రుణాలు పొంది చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బకాయిపడిన సభ్యులకు నోటీసులు అందజేసేందుకు అధికారులు బ్యాంకు సంసిద్ధమయ్యారు. వివరాల్లోకి వెళితే పెద్దతిప్పసముద్రం కేంద్రంగా బి.కొత్తకోట మండలానికి సంబంధించి గొర్రెలు, మేకల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సంఘంలో 184 రైతు సంఘాల గ్రూపులున్నాయి. ఇందులో 1,923 మంది రైతులు సభ్యులుగా కొనసాగుతూ రుణాలు పొందుతున్నారు. సదరు గ్రూపు సభ్యుల లావాదేవీలు, బ్యాంకుల నుంచి మంజూరైన రుణాలు, చెల్లించిన రుణాలు, పొదుపు లావాదేవీలకు సంభంధించి ఏటా ఏప్రిల్‌లో ఆడిట్ నిర్వహిస్తారు. ఇటీవల జరిగిన ఆడిట్‌లో 23 గ్రూపులకు సంభంధించి రూ.18,32,041ల రుణాలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సదరు మొండి బకాయిదారుల నుంచి రుణాల రికవరీ కోసం ఇన్‌చార్జి ఏపీఎం, కార్యదర్శితో పాటు అధ్యక్షుడి సంతకాలతో నోటీసులను అందజేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. అయితే సమాచారం లేకుండా కొంత మంది లీడర్లు సభ్యులను ఏమార్చి వారి నుంచి సంతకాలు తీసుకుని దొడ్డిదారిలో రుణాలు పొందారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గొర్రెలు, మేకల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ గ్రూపులోని సభ్యులు సంతకాలు చేసే ముందు అధికారుల సూచనలు తీసుకోవాలని, ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్తు అధికారుల మొద్దు నిద్ర

స్పిన్నింగ్ మిల్లు విక్రయించిన ఏడాదికి నోటీసులు


గోడకు బకాయి నోటీసు అతికించేందుకు వచ్చిన ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు

మదనపల్లె : ఏపీఎస్పీడీసీఎల్ అధికారుల మొద్దునిద్ర వీడటం లేదు. కాలగర్భంలో కలిసి పోయిన మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు విక్రయం జరిగిపోయి, యంత్రాలు, సామగ్రి తరలించేసి, పూర్తిగా స్థలాన్ని చదును చేసేశాక... బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు గోడకు అతికించడం ఇందుకు అద్దం పడుతోంది. ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు స్పిన్నింగ్ మిల్లు నుంచి సంస్థకు హెచ్‌టీఎస్‌సీ నెం.టీపీటీ 235 కింద రూ.9.08 కోట్ల బకాయిలు చెల్లించాలని ఏపీఎస్పీడీసీఎల్ రాయచోటి అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మయ్యచారి, మదనపల్లె ఆపరేషన్ ఈఈ ఎం.గంగాధరం, డిప్యూటీ ఈఈ బి.రురేంద్ర నాయక్, రూరల్ ఏఈ కే.రమేష్ తదితరులు వెళ్లి బకాయి నోటీసు గోడకు అతికించారు. సీటీఎం స్పిన్నింగ్ మిల్లు లాకౌట్ తర్వాత యాజమాన్యం మిల్లును బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. ఇప్పటికే ఈ స్థలం ఇద్దరు వ్యక్తుల చేతులు మారినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ఏపీఎస్పీడీసీఎల్ సంస్థకు రావాల్సిన బకాయి మొత్తం ఎవరు చెల్లించాలనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈఈ గంగాధరం వివరణ కోరితే... ఇప్పటికే తమ సంస్థ స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యానికి నోటీసులు జారీచేసిందని, లావాదేవీల విషయమై కోర్టులో కేసు నడుస్తుండటంతో బకాయి వసూలుకు ఆలస్యమైందని తెలిపారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ 1864 కింద ఏపీఎస్పీడీసీఎల్‌కు రావాల్సిన బకాయిలను వడ్డీతో కలిపి వసూలుచేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం



కర్నాటక సరిహద్దులో ప్రమాదానికి గురైన బొలేరో వాహనం, ప్రమాద స్థలంలో మృతుడు

రామసముద్రం : మండలంలోని కురిజల గ్రామానికి చెందిన బొలెరో వాహనం ఢీకొనడంతో కర్నాటక రాష్ట్రం గుడిపల్లె పంచాయతీ నాగేపల్లె, కోనంగుంట గ్రామాలకు చెరందిన ఐదుగురు దుర్మరణం చెందారు. కర్ణాటక రాష్ట్రంలోని ములబాగల్ తాలూకా గుడిపల్లె పంచాయతీ సమీపంలో ఈ సంఘటన జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. కర్నాటక రాష్ట్రం గుడిపల్లె పంచాయతీ నాగేపల్లెకు చెందిన భార్యాభర్తలు అప్పయ్య(45), గాయత్రి(40), కోనంగుంట గ్రామానికి చెందిన భార్యాభర్తలు వెంకటరమణప్ప(43), అలివేలమ్మ(38), అదే గ్రామానికి చెందిన రాధప్ప(45) కలిసి బైక్‌లపై ములబాగల్‌కు వెళ్తున్నారు. వడ్డిపల్లె నుంచి టమాటా బాక్సులతో వస్తున్న బొలెరో వాహనం ఎదురుగా వచ్చి అతివేగంతో రెండు బైకులను ఢీకొంది. దీంతో అప్పయ్య, గాయత్రి, వెంకటరమణప్ప, అలివేలమ్మ, రాధప్పలు అక్కడికక్కడే మృతిచెందారు. ములబాగల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.